నమస్తే తెలంగాణ
నల్లగొండ
I | నల్లగొండ, బుధవారం 9 ఏప్రిల్ 2025 | NALGONDA

దాచారంలో నేవూరి ధర్మేందర్‌రెడ్డి తల్లి పిచ్చమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సునీత, పైళ్ల, చిరుమర్తి, కూసుకుంట్ల, నాయకులు కంచర్ల, క్యామ మల్లేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

నేవూరి కుటుంబానికి మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శ

మోత్కూరు, ఏప్రిల్ 8 : మండలంలోని దాచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేవూరి ధర్మేందర్‌రెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ ఇటీవల మృతి చెందారు. గ్రామంలో మంగళవారం పిచ్చమ్మ చిత్ర పటానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతోపాటు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య పూల మాల వేసి నివాళి అర్పించారు. ధర్మేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్, బీఆర్ఎస్ మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, కొండ సోంమల్లు, గజ్జి మల్లేశ్, గిరిగాని శ్రీనివాస్, సామ పద్మారెడ్డి, సాదుల నర్సయ్య, పొన్నాల వెంకటేశ్వర్లు, తొట్ల స్వామి యాదవ్, కడమంచి వస్తాద్, అండి రజితారాజిరెడ్డి, శైలజ, అనిత, జ్యోతి, ధనమ్మ ఉన్నారు.

బీఆర్ఎస్ వరంగల్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్దఎత్తున తరలిరావాలి

- పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
- రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిది ప్రజా వ్యతిరేక పాలన
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 8 : భారత రాష్ట్ర సమితి ఏర్పడి 24 సంవత్సరాలు పూర్తి చేసుకొని 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన వరంగల్ సభ పోస్టర్లను ఆవిష్కరించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లక్షలాది మందితో నిర్వహించనున్న ఈ సభలో పార్టీ అధినేత కేసీఆర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యాచరణకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ప్రతి గ్రామం నుంచి రైతులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు వచ్చేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. గతంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేని చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందని, 14 ఏండ్లు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి దేశానికి రోల్ మోడల్ చేశారని తెలిపారు. సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు నీటి తీరువా రద్దు, రైతు బంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మత్స్యకారులకు చేపలు, యాదవులకు గొర్రెలు, దళిత బంధును అందజేసిన మహా నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రజలంతా మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆర్ రావాలని బలమైన ఆకాంక్షతో ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సూర్యాపేట జిల్లా నుంచి 26వేల మందిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమావేశంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, నాయకులు ఉప్పల ఆనంద్, ఉప్పల సైదులు, బుడిగ నవీన్ పాల్గొన్నారు.

దేవరకొండలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), ఏప్రిల్ 8 : ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన పోస్టర్‌ను దేవరకొండలో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ పార్టీగా మొదలైన బీఆర్ఎస్ ప్రస్థానం రాజకీయ పార్టీగా ఎదిగి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేసిందన్నారు. పదేండ్ల కేసీఆర్ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు. ప్రతి గ్రామం నుంచి జనం సభకు తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లోక్యనాయక్, జనార్దన్‌రావు, గాజుల రాజేశ్, కేతావత్ శంకర్‌నాయక్, రవీందర్, కృష్ణ, జానీబాబా, ఇలియాస్ పటేల్, చంద్రమౌళి, సత్యనారాయణ, ఇద్దయ్య, మధు, బాబా, సతీశ్, రాములు, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచి రైస్ మిల్లుల వద్ద రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ

- రైతులకు ధాన్యం మద్దతు ధర చెల్లించేలా చర్యలు

మిర్యాలగూడ, ఏప్రిల్ 8 : రైస్ మిల్లుల వద్దకు వచ్చే రైతుల ధాన్యానికి మద్దతు ధర ఇచ్చే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని, బుధవారం నుంచి ఆయా మిల్లుల వద్ద విధులు నిర్వహించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆదేశాలు జారీచేశారు. రైతుల ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, మిల్లర్లు సిండికేట్‌గా మారారని నమస్తే తెలంగాణలో కథనాలు ప్రచురితం కావడంతో కలెక్టర్ ఇలా త్రిపాఠితోపాటు ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశంతో మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో నేటి నుంచి సన్న ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లుల వద్ద రెవెన్యూ అధికారులు పర్యవేక్షించనున్నారు. ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు మిల్లుల వద్ద ధాన్యానికి మద్దతు ధర ఇచ్చేలా, ట్రాక్టర్లలో ధాన్యం వెంటనే దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోనున్నారు.

సామాన్యులపై గుది'బండ'

వంట గ్యాస్ ధరలను పెంచేసిన కేంద్రం

గ్యాస్ వినియోగదారులారా..! గ్యాస్ సిలిండర్ బుక్ చేస్తున్నారా..? అయితే ఇదివరకు ధరలో బుక్ చేయడం కుదరదు.. జేబులు ఇంకిన్ని డబ్బులు పెట్టుకోవాల్సిందే.. సామాన్యుడి జేబులకు చిల్లులు పడాల్సిందే.. అట్లయితనే బండ బుక్ అవుతుంది.. ఎందుకంటారా..? కేంద్రం ప్రభుత్వం వంట గ్యాస్ రేట్లను పెంచేసింది. ఏకంగా ఒక్కో బుడ్డిపై రూ. 50 దంచింది. పెరిగిన రేటులో గ్యాస్ బండ రూ. రూ. 925కి ఎగబాకింది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు గ్యాస్ సిలిండర్ గుదిబండగా మారింది. ఇప్పటికే అన్ని రకాల ధరలతో సతమతమవుతున్న పేదలకు మరింత ఆర్థిభారం పడనుంది.

– యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ)

- ఒక్కో సిలిండర్‌పై రూ.50 అదనపు బాదుడు
- ఉమ్మడి జిల్లాలో 12.94 లక్షల మందిపై 6.5 కోట్ల భారం
- 2014లో రూ. 410.. నేడు రూ. 925..
- ఇప్పటికే పెట్రో, నిత్యావసర ధరలతో జనం కుదేలు
- గ్యాస్ ధరల పెంపుతో పలుచోట్ల నిరసనలు..
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనాలు



సూర్యాపేటలో గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నాడు రూ. 410.. నేడు రూ. 925

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక గ్యాస్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. మోదీ అధికారంలోకి వచ్చే నాటికి వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 410 ఉంది. ఇప్పుడు రెండు రెట్లు దాటిపోయింది. సోమవారం వరకు వంట గ్యాస్ ధర రూ. 875 ఉంది. తాజాగా ఒక్కో సిలిండర్‌పై రూ. 50 పెంచుతున్నట్లు ప్రకటించడంతో అది కాస్తా.. రూ. 925కి పెరిగింది. ఉజ్వల పథకానికి కూడా వర్తిస్తుందని వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12.94 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ధర పెంపుతో ప్రజలపై దాదాపు 6.5 కోట్ల అదనపు భారం పడనుంది. దాంతో జనం ఆందోళన చెందుతున్నారు.

సబ్సిడీకి కూడా రాంరాం..

కేంద్రం ఓ వైపు గ్యాస్ ధరలు పెంచుతూనే.. మరో వైపు గ్యాస్ సబ్సిడీకి మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నది. 2014కంటే ముందు గ్యాస్ సబ్సిడీ విధానం లేదు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్యాస్‌పై అధికంగా వసూలు చేస్తూ.. అందులోంచి సబ్సిడీ పేరుతో తిరిగి ఇచ్చే విధానానికి శ్రీకారం చుట్టింది. కానీ అది కూడా సక్కగా అమలు కావడం లేదు. రాను రాను సబ్సిడీని తగ్గిస్తూ పోతున్నది. ఇప్పుడు ఒక్కో సిలిండర్‌పై అతి తక్కువగా రూ. 40 సబ్సిడీ ఇస్తున్నది.

అన్ని రంగాలపై ఎఫెక్ట్..

గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో అన్ని రంగాలపై ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా సామాన్యులు సిలిండర్ కొనలేని పరిస్థితి ఉంది. ఒకప్పుడు కట్టెల పొయ్యి పొగలతో అనారోగ్యంపాలైన గృహిణులు గ్యాస్ రాకతో ఆ బాధ నుంచి తప్పించుకున్నారు. ఇప్పుడు సిలిండర్ ధర పెంపుతో మళ్లీ కట్టెల పొయ్యి పెట్టాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. హోటళ్లు, ఇడ్లి బండ్లు, స్ట్రీట్ వెండర్లు తదితర చిరు వ్యాపారులపై తీవ్ర ఎఫెక్ట్ పడనుంది.

ఆకాశన్నంటుతున్న ధరలు

కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పేదలు బతుకలేని పరిస్థితి ఏర్పడింది. ఏ రంగంలో చూసినా రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. డీజిల్, పెట్రోల్ రేట్లు సైతం నింగి వైపు చూస్తున్నాయి. 2014లో పెట్రోల్ ధర లీటరుకు రూ. 71 ఉంది. ఇప్పుడు అది ఏకంగా రూ.107కు పాకింది. డీజిల్‌ది ఇదే పరిస్థితి. 2014లో డీజిల్ లీటర్ ధర రూ.55 ఉండగా, ఇప్పుడు రూ. 96కు ఎగబాకింది. దీంతో వాహనదారులు బండ్లను నడిపే పరిస్థితి లేకుండాపోయింది. ఇక నిత్యావసర ధరలు సైతం భగ్గుమంటున్నాయి. ఏం కొనలేని పరిస్థితి దాపురించింది. పప్పులు, ఉప్పులు, బియ్యం, కూరగాయలు తదితర అన్నింటి ధరలు పెరిగిపోయాయి. వంట గ్యాస్ ధర పెంపుపై మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

పేదలకు భారంగా గ్యాస్ ధరలు

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచడం వల్ల సామాన్య, పేద మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతున్నది. దీనికి తోడు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగడంతో పేదలు బతుకడం కష్టమైతున్నది. ఎన్నికల ముందు కలబొల్లి మాటలు చెప్తారు.. తర్వాత పట్టించుకోరు. కేంద్ర ప్రభుత్వ పాలన సామాన్యుడి నడ్డి విరిచేలా ఉంది . ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

-కర్నాటి అంజమ్మ, పద్మా నగర్ కాలనీ, భూదాన్ పోచంపల్లి

సాగర్ డ్యామ్‌పై తెలంగాణ వైపు సీఆర్‌పీఎఫ్ బలగాల ఉపసంహరణ

డ్యామ్‌పై పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఆంధ్రా వైపు బలగాలు

నందికొండ, ఏప్రిల్ 8 : నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్‌పై తెలంగాణ వైపు విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు విధుల నుంచి ఉపసంహరించుకునట్లు ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు మూడు రోజుల క్రితమే వెలువడినా సీఆర్‌పీఎఫ్ బలగాలు డ్యామ్‌పై విధులు నిర్వహిస్తూ వచ్చారు. మంగళవారం సీఆర్‌పీఎఫ్ బలగాల అధికారులు తాము డ్యామ్ విధుల నుంచి వైదొలుగుతున్నట్లు లిఖిత పూర్వకంగా ఎన్నెస్పీ అధికారులకు సమాచారం అందించారు. నాగార్జునసాగర్ డ్యామ్ 13వ గేట్ వరకు తెలంగాణ వైపు విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు విధుల నుంచి వైదలగానే, గతంలో విధులు నిర్వహించిన ఎస్‌పీఎఫ్ బలగాలు విధుల్లో చేరుతాయని అధికారులు భావించారు. కానీ దానికి భిన్నంగా 13వ గేట్ నుంచి అవతల ఆంధ్రా వైపు వైపు విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు నాగార్జునసాగర్ డ్యామ్ పైన పూర్తి స్థాయిలో విధులు చేపట్టారు. డ్యామ్‌పై 15 నెలలుగా సీఆర్‌ఫీఎఫ్ బలగాలు రెండు టీములుగా విడిపోయి ఒక విభాగం తెలంగాణ వైపు ఉన్న డ్యామ్ 13వ గేట్ వరకు, మరో విభాగం 13 గేట్ నుంచి ఆంధ్రా వైపు విధులు చేపడుతూ వచ్చారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ డ్యామ్‌ను ఆంధ్రా వైపు సీఆర్‌పీఎఫ్ బలగాలు పూర్తి స్థాయిలో తమ ఆధీనంలో తీసుకోవడంపై రాజకీయ విశ్లేషకులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ తెలంగాణ వైపు ఆంధ్రా వైపు ఉన్న సీఆర్‌ఫీఎఫ్ బలగాలు వచ్చి విధులు నిర్వహించడంపై తమకు ఎటువంటి సమాచారం లేదని ఎన్నెస్పీ అధికారులు అంటున్నారు. దీనిపై ఆంధ్రా సీఆర్‌పీఎఫ్ అధికారులను వివరణ కోరగా తమకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం డ్యామ్‌పై పూర్తి స్థాయిలో విధులు చేపడుతున్నామని తెలిపారు.

నాగార్జునసాగర్ డ్యామ్ తెలంగాణ వైపు ఉన్న ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న ఆంధ్రా వైపు ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

సమ్మెకు ఆర్టీసీ ఉద్యోగులు సిద్ధం కావాలి

- తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు

ఆర్టీసీ ఉద్యోగులతో యూనియన్ నాయకులు

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 8 : ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఆర్టీసీ ఉద్యోగ జేఏసీ మే 7 నుంచి చేపట్టనున్న సమ్మెకు సిద్ధం కావాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు పుడిగ పుల్లయ్య, సుంకరి శ్రీనివాస్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం వారు ఆర్టీసీ ఉద్యోగులు, జేఏసీ నాయకులను కలిసి మాట్లాడారు. ఉద్యోగులకు గతంలో రోజుకు 500 కిలోమీటర్లు ఉన్న పని భారాన్ని 600 పెంచారని అన్నారు. నేటికీ 2017 అలవెన్స్‌లు అమలు చేయడం లేదని తెలిపారు. ఎల్క్ట్రిక్ బస్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో సంస్థ ఉనికి ప్రమాదంలో పడుతుందని చెప్పారు. చలో లేబర్ కమిషనర్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, ఇలాగే ఐక్యంగా ఉండి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎస్ గౌడ్, ఆర్.సైదులు, జి.వెంకన్న, మధు, వి.సేవ్యా, భాను, అబ్దుల్ ఘని, లచ్చయ్య, ఏకాంబరం, నేతి సావిత్రి, సైదమ్మ, సాగర్, వెంకన్న పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేయాలని రోడ్డెక్కిన అన్నదాతలు

కోదాడ మండలం తమ్మర.. తిప్పర్తిలో నిరసనలు

తాలు, తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారని ఆవేదన

కోదాడ రూరల్ : కోదాడ–ఖమ్మం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

కోదాడ రూరల్/తిప్పర్తి, ఏప్రిల్ 8 : ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేయాలని పలుచోట్ల రైతులు రోడ్డెక్కారు. కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు చేయకపోవడంతో నిరసన చేపట్టారు. కోదాడ మండలం తమ్మరలో హడావుడిగా కేంద్రాన్ని ప్రారంభించి రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు మంగళవారం ఐకేపీ సెంటర్ ఎదురుగా కోదాడ–ఖమ్మం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. దాంతో వాహనాలు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి వచ్చి నిరసనను విరమింపజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, నాయకులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో కేవలం టెంట్ మాత్రం వేశారని, స్థానిక సిబ్బందికి రసీదు బుక్కులు ఇవ్వలేదని, మ్యాచర్ మిషన్, గన్నీ బస్తాలు, సన్నాలు కొలిచే మిషన్, బ్లోయర్లు లేకుండా కొనుగోలు ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ఆర్భాటం తప్ప ఆచరణ శూన్యమని విమర్శించారు. నిరసనలో సీపీఐ, బీజేపీ నాయకులు బొల్లు ప్రసాద్, కనగాల నారాయణరావు, రైతులు నన్నె సాహెబ్, జల్లా జనార్దన్, మల్లెబోయిన వెంకటేశ్‌బాబు, పుల్లయ్యచౌదరి, సామినేని సుబ్బారావు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తిలో కొర్రీల పేరుతో కొనుగోళ్లు నిలిపివేత

నాలుగు రోజులుగా పలు కారణాలు చూపుతూ ధాన్యం కొనుగోలు చేయకుండా తమను ఇబ్బంది పెడుతున్నారని తిప్పర్తిలో రైతులు నిరసన చేపట్టారు. నార్కట్‌పల్లి–అద్దంకి హైవేపై బైఠాయించి ఆందోళన చేశారు. కొనుగోళ్లు చేయకపోవడంతో అకాల వర్షంతో ధాన్యం తడిసే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చార్మి రకం వడ్లు కొంచెం సన్నగా ఉండడం వల్ల తాలు పేరుతో మిల్లర్లు లారీలను నిలుపుతున్నారని, అధికారులు మిల్లర్లతో మాట్లాడి వెంటనే దిగుమతి అయ్యే విధంగా చూడాలని కోరారు.

తిప్పర్తి : ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

గత ప్రభుత్వం తడిసిన వడ్లను సైతం కొన్నది

గత ప్రభుత్వం వర్షానికి తడిసిన, మొలకలు వచ్చిన వడ్లను సైతం కొన్నది. ఇప్పుడు తాలు, తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నరు. అప్పుడు లేని సమస్యలు ఇప్పుడు ఎందుకు వస్తున్నయ్. చార్మి రకం వడ్లు ప్రభుత్వం ఇచ్చిన సీడ్స్. ఇప్పుడు రైతులు పండించిన తర్వాత తాలు ఎక్కువగా ఉందని కొర్రీలు పెట్టడం సరికాదు. వెంటనే రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వడ్లను కొనాలి.

- గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, తిప్పర్తి

నాలుగు రోజులుగా కాంటా పెడ్తలేరు

నాలుగు రోజుల నుంచి కొనుగోలు కేంద్రంలో వడ్లు కొనడం లేదు. ధాన్యం తూర్పారా పట్టి తేవాలని కాంటాలను ఆపుతున్నరు. రోజుకో అధికారి వస్తుండు పోతుండు కానీ కాంటాలు మాత్రం పెట్టడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన వడ్లనే మేము పండించాం. కానీ ఇప్పుడు వాటిని ఆపుతున్నారు. అధికారులు వెంటనే కొనుగోళ్లు చేపట్టి మిల్లుల వద్ద తొందరగా దిగుమతి అయ్యే విధంగా చూడాలి.

- బత్తుల సోమరాజు, రైతు, తిప్పర్తి

ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని ధర్నా

వేములపల్లిలో రైస్ మిల్లు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 8 : వేములపల్లి మండలంలోని ఓ రైస్ మిల్లు వద్ద ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని మంగళవారం సాయంత్రం రైతులు ధర్నా చేశారు. సుమారు వంద ట్రాక్టర్లు హెచ్ఎంటీ, చింట్లూ రకం ధాన్యంతో రాగా రెండు గంటలకు పైగా ధాన్యం కొనుగోలు చేయకపోవంతో ఆందోళనకు దిగారు. మిల్లు వద్ద పెద్ద ఎత్తున రైతులు గుమిగూడి ఆందోళన చేయగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడికి వచ్చి రైస్ మిల్లు యజమానితో మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సూచించడంతో ఆందోళన విరమించారు. హెచ్ ఎంటీ రకం ధాన్యానికి రూ.2100, చింట్లూ సన్న రకం ధాన్యానికి రూ.2,200 నుంచి రూ.2300 వరకు ధర వేశారు.

న్యాయవాదుల నిరసన

మిర్యాలగూడ కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 8: హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది ముజ్‌తబాపై కొందరు దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం, సెక్రటరీ వేలాద్రి, న్యాయవాదులు పవన్‌కుమార్, గూడూరు శ్రీను, నేతి సత్యనారాయణ, లింగంపల్లి శ్రీనివాస్, విజయసారథి, కొంక వెంకన్న పాల్గొన్నారు.